క్లుప్తంగా

కేసీ కెనాల్‌కు 1,060 క్యూసెక్కుల నీరు



కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

పాములపాడు: కేసీ కెనాల్‌కు 1,060 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని కేసీసీ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి రెండు పంపుల ద్వారా 480 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం రెండు పంపుల ద్వారా 680 క్యూసెక్కుల చొప్పున కేసీలోకి వస్తుందన్నారు. కాగా మండలంలోని కేసి కెనాల్ 120 కిలోమీటర్ లాకీన్స్‌లా వద్ద నుంచి తూడిచెర్ల ఎస్కేప్ చానల్‌కు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

భగవద్గీతతో సత్ప్రవర్తన



భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: భగవద్గీతను చదివి అనుకరించడం ద్వారా సత్ప్రవర్తనతో మెలుగుతామని త్రైతసిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక ' ప్రబోధ సేవా సమితి ఆత్మకూరు కమిటీ అధ్యక్షుడు మునిదాసు పేర్కొన్నారు. ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీగత సిద్ధాంతంపై ఎదురుపాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు భగవద్గీత పుస్తకాలను, త్రైతసిద్ధాంతం కాలెండర్లను పంపిణీ చేశారు. సభ్యులు భాస్కర్, భాస్కర్ గౌడు, ప్రకాష్, పవన్, నాగన్న పాల్గొన్నారు.

బోరు బావుల రైతులు మాత్రమే వరి నాట్లు వేసుకోవాలి



వరి నారును పరిశీలిస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: ఖచ్చితమైన నీటి సదుపాయం కలిగిన బోరుబావుల రైతులు మాత్రమే వరి నాట్లు వేసుకోవాలని ఏవో పవన్ కుమార్ సూచించారు. మండలంలో రైతులు వరి నాట్లు విస్తారంగా వేస్తున్న సందర్భంలో ఆదివారం ఏవో వరినారు మడులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నారు తీసేటపుడు మొక్కలు లేకపోవచ్చు, మూన త్వరగా తిరుగుతుంది, నాలుగు నుంచి ఆరు నారు మొలకలను నాటుకు ఉపయోగించుకోవాలని చెప్పారు. ముదురు నారా నాటితే దిగుబడి తగ్గుతుందని, నాటు నాటితే పిలకలు ఎక్కువగా వస్తాయన్నారు.

ఈ - క్రాప్ బుకింగ్ చేయించుకోండి

జూపాడుబంగ్లా: ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటలను రైతుభరోసా కేంద్రాలను ఆశ్రయించి వెంటనే ఈ-క్రాప్ బుకింగ్‌తో పాటు పంటల బీమా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు గాను సాధారణ సాగు విస్తీర్ణం 10,022 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 60శాతం మేర మిరప, కంది, పత్తి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగు చేశారని చెప్పారు. మిగిలిన రైతులు ఇప్పుడిప్పుడే పంటలను సాగుచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

విజయవంతం చేయండి

ఆత్మకూరు: కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం బస్సు యాత్ర పోస్టర్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ బీజేపీ పాలన నుంచి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ బస్సు యాత్ర నిర్వహిస్తుందని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో పాటు అగ్రనేతలు బస్సు యాత్రలో పాల్గొంటున్నారన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలోకి ప్రవేశిస్తుందని కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు. నాయకులు వెంకటశివుడు, అటవుల్లా, కాజావుద్దీన్, అహ్మద్ పాల్గొన్నారు.

ఓంకారంలో భక్తజన సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారంలో కొలువైన శ్రీ గంగా, ఉమాసమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. శ్రావణమాసం, నాగులచవితి పురస్కరించుకుని వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకుని స్వామి,అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. అలాగే ఆలయ ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

తరగని అభిమానం

నందికొట్కూరు: 2019 నుంచి జరిగిన ప్రతి ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకే పట్టం కడుతున్నారు. అన్ని ఎన్నికల్లో ఏకపక్షంగా తీర్పునిస్తున్నారు. శనివారం జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో సైతం అదే మద్దతును కొనసాగించడంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేశారు. ఈ నెల 19వ తేదీన జరిగిన గ్రామ పంచాయతీ వార్డు మెంబరు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. నియోజకవర్గంలో 11 వార్డు మెంబర్లకు గాను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 8 మంది గెలుపొందారు.

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న నాలుగు వార్డు సభ్యుల ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ రెండు, ఇతరులు స్వతంత్ర్య అభ్యర్థులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 14న నామినేషన్లు విత్‌డ్రా సమయంలో ఒక్కో స్థానం నుంచి ఒక్కొక్కరు మాత్రమే బరిలో ఉండడంతో నలుగురిని అధికారులు ఏకగ్రీవంగా ప్రకటించారు. శ్రీశైలం నియోజకవర్గంలోని నాలుగు స్థానాల్లో ఆత్మకూరులో

మండలం-గ్రామం

గ్రామం/మండలం	వార్డు సంఖ్య	వైఎస్సార్‌సీపీ వార్డుమెంబరు	ఇండిపెండెంట్/టీడీపీ	మెజార్టీ
నాగటూరు(నందికొట్కూరు	01	హుసేనయ్య	చెరుకు రత్నమ్మ	53
పగిడ్యాల మండలకేంద్రం	09	గుండేపోగు సాంబ	మీనుల బాబు	64 ఓట్లు
ప్రైపాలెం(మిడుతూరు)	05	బాలసుబ్బన్న	లక్ష్మిదేవి	08 ఓట్లు
అలగనూరు(మిడుతూరు)	10	శేషమ్మ	--	57ఓట్ల
జలకనూరు	08	--	కుమారి టీడీపీ	ఏకగ్రీవం
వీపనగండ్ల(మిడుతూరు)	03	చిన్నస్వామన్న	---	ఏకగ్రీవం
మిడుతూరు మండలకేంద్రం	13	భాగ్యమ్మ	---	ఏకగ్రీవం
పాములపాడు మండలకేంద్రం	04	--	ఇండిపెండెంట్ రమాదేవి	ఏకగ్రీవం
కొత్తపల్లి మండలకేంద్రం	10	---	ఇండిపెండెంట్ నాగమ్మ	7ఓట్లు
జూపాడుబంగ్లా మండల కేంద్రం	07	రాజ్యలక్ష్మి	--	ఏకగ్రీవం
తత్తూరు(జూపాడుబంగ్లా)	02	గోవిందు	నూరుల్లా	20ఓట్లు

రెండు స్థానాలు, బండిఆత్మకూరులో రెండు స్థానాలు ఖాళీగా ఉండడంతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. నామినేషన్ల విత్‌డ్రా సమయంలో ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలోని 8వ వార్డుకు సంపత్ మాత్రమే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎంపికైనట్లు చెప్పారు. ముష్టపల్లి గ్రామానికి చెందిన 1వ వార్డుకు ఒకే నామినేషన్ రావడంతో రాజేశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బండిఆత్మకూరు మండలం రామాపురం గ్రామంలో 4వ వార్డుకు ఎల్లాకృష్ణుడు , కడమల కాలువ గ్రామంలో 4వ వార్డుకు సువర్ణమ్మ ఒకే నామినేషన్ రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.



హుసేనయ్య, గుండేపోగు సాంబ, బాలసుబ్బన్న, శేషమ్మ, కుమారి

చిన్నస్వామన్న, భాగ్యమ్మ, రమాదేవి, నాగమ్మ, రాజ్యలక్ష్మి

గోవిందు, సంపత్, రాజేశ్వరమ్మ, బోయ ఎల్లా కృష్ణుడు, సువర్ణ

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటిన వైఎస్సార్‌సీపీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: ఈ నెల 19వ తేదీన జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం పతాకం ఎగురవేశారని, ఇందుకు సీఎం వైఎస్ జగనన్న సంక్షేమ పథకాలే కారణమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పుల్యాల నాగిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాయన్నారు. నాలుగు వార్డు స్థానాల్లో టీడీపీకి అభ్యర్థులు లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. నియోజకవర్గంలో 11 వార్డు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే టీడీపీ ఒక స్థానానికే పరిమితమైందన్నారు. సర్పంచులు నాగిరెడ్డి భాస్కర్, వైస్ సర్పంచ్ రామకృష్ణ, వార్డు మెంబర్లు బోయ నాగేంద్ర, గుండేపోగు సాంబ, బాలసుబ్బన్న, మర్రి రామచంద్రుడు, జేసీఎస్ మండల కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు రవి నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

హైవే పనులను అడ్డుకోవద్దు

నందికొట్కూరు రూరల్ : మండలంలో జరుగుతున్న నేషనల్ హైవే 340-సీ పనులను రైతులు అడ్డుకోరాదని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నేషనల్ హైవే అధికారులు, మండల అధికారులతో హైవే పనుల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను త్వరగా అందజేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ వాల్యూ ప్రకారం రికార్డులను పరిశీలించి నష్ట పరిహారం విషయంలో తగు న్యాయం చేస్తామని చెప్పారు. అనంతరం హైవేలో భూములు కోల్పోయిన రైతులు ఆయనను కలిసి తమకు నష్టపరిహారాన్ని పెంచాలని వినతి పత్రం అందజేశారు. డీటీ సత్యనారాయణ, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న రైతులు

ఉచిత విత్తన కిట్లు పంపిణీ

వెలుగోడు: ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు ఉచిత విత్తన కిట్లను ఆదివారం అందజేశారు. మండలంలోని బోయరేవుల, గుంతకందాల, ఆత్మకూరు మండలంలోని నల్లకాలువ, ఎస్‌ఆర్ పేట, బాపనంతపురం ఎస్సీ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రమణయ్య, ఎస్సీ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ చేతుల మీదుగా 39 మంది రైతులకు ఉచిత విత్తన కిట్లు పంపిణీ చేశారు. విత్తన కిట్టులో జొన్న,కందులు, కొర్ర, మినుములు, నువ్వులు, పొద్దు తిరుగుడు, జీలుగ, మొక్కజొన్న, సద్దలు, రాగులు, వేరుశనగ విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్ నాగమణి, ప్రకతి వ్యవసాయ విభాగం ఎస్‌ఆర్పీ నరేంద్ర గౌడ్, సుబ్బరాయుడు, శశికళ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



విత్తన కిట్లు అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

మహానందిలో సండే సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు, నాగులచవితి పర్వదినం కలిసి రావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా భక్తులు కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. మహానందీశ్వరస్వామి దంపతులకు రాత్రి ఏకాంత సేవ పూజలు వైభవంగా జరిగాయి.



శ్రీ కామేశ్వరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

వరుణ దేవుడి కటాక్షం కోసం..



పాతాళగంగతో ఊరేగింపుగా వెళ్తున్న రైతులు

నందికొట్కూరు: వరుణ దేవుడి కటాక్షం కోసం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు పాతాళగంగతో అభిషేకం చేస్తామని రైతు కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, శ్రీరాములు, ఉపేంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం శ్రీశైలం నుంచి పాతాలగంగ నీటిని రైతు సంఘం కమిటీ సభ్యులు తెచ్చారు. ఆ నీటితో వచ్చిన కమిటీ సభ్యులకు పట్టణ రైతులు స్వాగతం పలికారు. ఆత్మకూరు రోడ్డులో ఉన్న సవారమ్మ గుడి నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ఉదయం 7 గంటలకే ఆంజనేయస్వామి దేవాలయంలో వెలిసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు ఆ నీటితో అభిషేకం చేస్తామని చెప్పారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మహానందికి వచ్చారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన ఆయనకు జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, జేఏ హేమశంకర్ స్వాగతం పలికారు. ఆయన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు. అనంతరం సూర్యనంది ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు.



మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన సీఈఓ నాసరరెడ్డి దంపతులు

పుస్తకాలు, దుస్తుల అందజేత

నంద్యాల(వ్యవసాయం): రోటరీ క్లబ్ నంద్యాల ఆధ్వర్యంలో రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సేవా సంస్థకు ఆదివారం ఐరన్ ర్యాక్స్, పుస్తకాలు, బట్టలు అందజేసినట్లు అధ్యక్షుడు దండె దస్తగిరి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోళ్ల జయకృష్ణ, లక్ష్మీకాంత్ రెడ్డి సహకారంతో సంస్థ నిర్వాహకుడు సన్నల సాయిరాంరెడ్డికి అందజేమాని చెప్పారు. క్లబ్ సభ్యులు సుధాప్రసాదరెడ్డి, శ్రీరామ్మూర్తి, కైలాసనాథరెడ్డి, రాజశేఖర్, విజయశేఖర్‌రెడ్డి, భూషణం, మధుసూదన్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ అభివృద్ధికి కృషి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్‌లు ఏర్పాటు చేసి వారిని భాగస్వాములను చేయడంతో పాటు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.





మిడుతూరులోని నాగులకట్టకు పాలు పోసి పూజలు నిర్వహిస్తున్న మహిళలు,మహానందిలో పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

పాములపాడు: నాగుల చవితి పండుగను ఆదివారం మండలంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో మహిళలు ఆయా గ్రామాల్లోని పుట్టల వద్ద, నాగుల కట్టల వద్ద నాగ దేవల విగ్రహాలకు పాలు పోసి, నువ్వుల ముద్దలు,చలువ పిండి, నోముల దారాలు ఉంచి నైవేద్యాలు సమర్పించారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, అర్లపాడు, పాత, కొత్త ముచ్చుమర్రి, కొత్త ఎల్లాల, వనుములపాడు, సంకిరేణిపల్లె, బీరవోలు, ఆంజనేయనగర్, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం , తూర్పు, పడమర ప్రాతకోట, ఎం,ఎన్. ఘణపురం తదితర గ్రామాల్లోని ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని నాగులకట్టకు చేరి భక్తితో నాగ దేవత ప్రతిమలను పాలు, నువ్వుల పిండి సమర్పించి పూజించారు.

మిడుతూరు: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే మహిళలు ఉపవాస దీక్షతో నాగులకట్ట వద్ద, పొలాల గట్టుపైన ఉన్న పుట్టల వద్ద పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు ప్రీతికరమైన నువ్వుల లడ్డు, చలుపిండి లడ్లు, పచ్చి బేడలు, కొబ్బెర, బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.అదేవిధంగా నూతన వధూవరులు తంబ్రాల నాటి దుస్తులు ధరించి పుట్టవద్దకు చేరుకొని పాలు పోశారు.

జూపాడుబంగ్లా : నాగపంచమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో నాగమయ్య ప్రతిమలకు, పుట్టలకు పాలుపోసి కాపాడాలని మొక్కుకున్నారు.



నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఈఓ ఎస్.లవన్న

తాటిపాడు గ్రామంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయం వద్ద నూతన నాగమయ్య ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

మహానంది: క్షేత్రంలో నాగులచవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం ఆవరణలోని నాగులకట్ట వద్ద నాగదేవతలను విశేషంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని నాగదేవతలను దర్శించుకుని నైవేద్యం సమర్పించారు.

మహానంది: బండిఆత్మకూరు మండలంలో ఆదివారం నాగులచవితి వేడుకలు వైభవంగా జరిగాయి. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మహిళలు ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి పుట్టల వద్దకు చేరుకుని నాగమయ్య స్వామికి పాలు, పెసర పప్పు, చీర, పట్టువస్త్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

శ్రీశైలంటెంపుల్: శ్రావణ శుద్ధ చవితిని పురస్కరించుకుని శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని నాగులకట్ట వద్ద పలువురు భక్తులు నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు నాగులకట్ట వద్దకు చేరుకుని పత్తితో చేసిన వస్త్రం, యజ్ఞోపవీతం, పలు రకాల పుష్పాలతో నాగమూర్తులను అలంకరించి పాలతో అభిషేకించారు. అనంతరం నువ్వులపిండి, చలిమిడి, వడపప్పులను నివేదించారు. నాగులచవితి పూజా కార్యక్రమాల్లో దేవస్థాన ఈఓ ఎస్.లవన్న పాల్గొన్నారు.



నెహ్రూనగర్‌లో నాగదేవత ప్రతిమలకు పూజలు చేస్తున్న భక్తులు



తాటిపాడు గ్రామంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయం వద్ద నూతనంగా ప్రతిష్ఠించిన నాగమయ్య ప్రతిమలు



నాగుల కట్టకు కొబ్బరిగిన్నెతో పాలు పోస్తున్న చిన్నారి

నీటి సమస్యకు పరిష్కారం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో నీటి సమస్య పరిష్కారం కోసం పనులు వేగంగా సాగుతున్నాయి. జెడ్పీ నిధులు రూ.5లక్షలతో పనులు చేపట్టారు. ఇందులో భాగంగా జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి పొలంలో బోరు బావిని తవ్వించారు. నీరు పుష్కలంగా పడటంతో ఎస్సీ, బీసీ, ముస్లిం మైనార్టీ కాలనీలకు పైపులైన్ పనులు చేపట్టారు. మోటారు ఏర్పాటు చేసి విద్యుత్ పనులను ఆదివారం షురూ చేశారు. విద్యుత్‌పనులు పూర్తి కాగానే గ్రామంలోకి నీటిని సరఫరా చేస్తామని జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతిరామలింగేశ్వరరెడ్డి తెలిపారు. పనులు పూర్తయితే గ్రామానికి నీటి సమస్య పరిష్కారమైనట్లేనన్నారు.

విద్యుత్ వేళల్లో మార్పులు

పగిడ్యాల: సోమవారం విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నందున వినియోగదారులు, రైతులు గమనించాలని ట్రాన్స్‌కో ఏఈ క్రాంతికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రాతకోట ఫీడర్ పరిధిలో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, లక్ష్మాపురం ఫీడర్ కింద ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30గంటల వరకు, ముచ్చుమర్రి ఫీడర్ పరిధిలో ఉదయం 5 నుంచి ఉదయం 9.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యుత్ ఉంటుందని చెప్పారు.

శాంతిర్యాలీ

కొత్తపల్లి: మణిపూర్‌లో హింసను ప్రేరేపించి, ప్రజలను బలిచేయడం దుర్మార్గమని పాస్టర్ రెవరెండ్ ఇమ్మానియేలు జీవన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని దుద్యాల గ్రామంలో సీఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులతో మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన హింసాకాండను నిరసిస్తూ శాంతిర్యాలీ నిర్వహించారు.

అత్తపై అల్లుడి దాడి

మహానంది: గాజులపల్లె గ్రామానికి చెందిన షహనాబీపై ఆమె అల్లుడు దాడి చేసిన ఘటనలో అత్త, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. షహనాబీ కుమార్తె ఆశకు శిరివెళ్ల మండలం గుండంపాడుకు చెందిన మౌలాలితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిపించారు. వారి మధ్య విభేదాలు రావడంతో పుట్టింటికి వచ్చింది. కొన్నాళ్లు గాజులపల్లెలో ఉంటూ మళ్లీ భర్త దగ్గరికి వెళ్లిన ఆశను అల్లుడు వేధిస్తుండటంతో తిరిగి ఇంటికి తీసుకెళ్లేందుకు వెళ్లిన అత్త షహనాబీ, ఆమె కుమారులపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. షహనాబీ ఫిర్యాదు మేరకు అల్లుడు మౌలాలి, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శ్రీశైలంలో అభివృద్ధి పనుల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న పరిశీలించారు. ఆదివారం దేవస్థాన పరిపాలనాంశాల్లో భాగంగా ఘంటామఠం, విభూతిమఠం, గణేశసదనమును ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాచీన కట్టడాల పరిరక్షణలో భాగంగా దేవస్థానం పంచమఠాల పునర్నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేశారు. ఇప్పటికే ఘంటామఠానికి సంబంధించి గర్భాలయం, అంతరాలయం, ముఖ మండపం, విమానగోపుర నిర్మాణాలు పూర్తి చేశారు. అలాగే ఘంటామఠ ప్రాంగాణములోని ఉపాలయాలు కూడా పూర్తి చేశారు. మఠాల ప్రాంగాణం చుట్టు పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. వర్షాకాలం పూర్తయ్యేలోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఘంటామఠంలోని కౌమారీదేవి, పాండవ గుహ వద్ద ఉన్న కాలభైరవస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించాలని, జటావీరభద్రమఠాన్ని పునరుద్ధరించాలని చెప్పారు. అనంతరం విభూతిమఠంను పరిశీలించి, మఠం చుట్టు గార్డెనింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. టూరిస్ట్ బస్టాండ్ సమీపంలో భక్తుల వసతి కోసం 220 గదుల సముదాయంగా నిర్మించిన గణేశసదనమును తనిఖీ చేసి వెనుక భాగంలో అడవి జంతువులు రాకుండా కంచె ఏర్పాటు చేయాలని కోరారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, సీఎస్ఓ శివప్రసాద్, డీఈ చంద్రశేఖర శాస్త్రి, సుబ్బారెడ్డి, ఉద్యానవన అధికారి లోకేష్, విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, ఏఈలు భవన్, విష్ణు, రాజేష్, చిరంజీవి పాల్గొన్నారు.



పంచమఠాలను పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ ఎస్.లవన్న

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండండి

నంద్యాలటౌన్: విద్యార్థులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్సార్‌నగర్‌లోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు దోమల వ్యాప్తి, వాటి వల్ల వ్యాపించే విషజ్వరాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు వ్యాప్తి చెందవని, తద్వారా అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ఉంటాయన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వారికి ప్రత్యేక చికిత్స అందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి వరప్రసాద్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణలు మాట్లాడుతూ దోమ తెరలు వాడటం, డ్రైడే పాటించడం వలన దోమకాటు నుండి తప్పించుకోవచ్చాన్నారు. సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ఇటీవల సర్దుబాటు పదోన్నతులు, బదిలీలు జరిగిన ఉపాధ్యాయులకు వేతనాలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు కోరారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులకు ఇచ్చే లీడర్ షిప్ ట్రెనింగ్ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఏ జిల్లా వారికి ఆ జిల్లాలోనే నిర్వహించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్దుబాటులో బదిలీపై వచ్చిన వారిని జూనియర్‌గా పరిగణిస్తున్నారన్నారు. అలా కాకుండా సర్వీసు జూనియర్‌ను సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడు భాస్కరరెడ్డి, విజయరావు, నరసింహులు, సుమయూన్, జగదీష్ పాల్గొన్నారు.

ముగిసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్‌బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలోని గీతా మందిరంలో వారం రోజుల నుంచి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జ్ఞానప్రసాద్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆదివారం ముగిశాయి. నువ్వు బాగుండాలి-నీ ప్రపంచం బాగుండాలి అనే అంశంపై వారం రోజులపాటు భక్తులకు ప్రవచనాలు వినిపించారు. అనంతరం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు భవనాసి వాసు, తిమ్మయ్య, రామకృష్ణ, గాంధీ, అంజి పాల్గొన్నారు.